18వ
# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
బుధవారం,30 అక్టోబర్ 2024 8 పేజీలు

## ఆవు దూడకు కృత్రిమ కాలు
# అమర్చిన సదాశివమూర్తి




**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** మానవసేవే మాధవసేవ" అంటారు. కాని సకల జీవరాశిలోను ప్రాణం ఉంటుంది, పరమాత్మ ఉంటాడు.కనుక భూతదయ ఆచరణలో చూపించేవారికి ఆభూతనాథుని దివ్యానుగ్రహం మెండుగా ఉంటుంది.చైతన్య కృత్రిమ అవయవాల కేంద్రం అధినేత వేదాంతం సదాశివ మూర్తి మనుషులకు కృత్రిమ అవయవాలు అమర్చటంలో సిద్ధహస్తులన్నది లోకవిదితమే.ఇ ప్పుడాయన కాలు విరిగిన ఆవుకు కృత్రిమ కాలుఅమర్చి,దానిని చకచకా నడిపిస్తున్నారు చూడండి. ఈఆవును ఎమ్.శ్రీనివాసరావు అనేవ్యక్తి కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం,కె.కొత్తపాలెం గ్రామంనుంచి ఆటోలో ఎక్కించి తీసికొని వచ్చారు.ఈ సేవకు గాను సదాశివమూర్తి ఒక్కరూపాయికూడ తీసికోకుండ తన వదాన్యతను ,సేవా తత్పరతను

- తరువాయి 2లో..

## ఏలూరు జిల్లాలో
# 16,38,436 మంది ఓటర్లు

- పురుషులు 7,99,781 మంది, మహిళలు 8,38,531,థర్డ్ జెండర్స్ 124
- సవరణపై నెల రోజులపాటు క్లెయిమ్‌లు,అభ్యంతరాల స్వీకరణ
- రాజకీయ పార్టీల సమావేశంలో జిల్లా కలెక్టర్





**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లాలో 2025 జనవరికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఎస్ఎస్ఆర్ -2025 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సందర్బంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఎస్ఆర్ -2025లో భాగంగా 16,38,436 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 7,99,781 మంది, మహిళా ఓటర్లు 8,38,531 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 124 మంది ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డ్రాఫ్ట్ పబ్లికేషన్ ను విడుదల చేశామన్నారు. ఈనెల 29వ తేదీ నుండి నవంబరు 28వ తేదీ వరకు క్లెయిమ్స్ అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. క్లెయిమ్స్ అభ్యంతరాలను డిశంబరు 24వ తేదీలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు.తుది ఓటర్ల జాబితాను (ఫైనల్ పబ్లికేషన్)ను2025జనవరి 6వతేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు.బూత్‌స్థాయిలోనవంబరునెలలోఎన్నికలకమీషన్ నిర్దేశించినశని,ఆదివారాల్లో స్పెషల్ క్యాంపయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు.సమావేశంలోజిల్లా రెవిన్యూఅధికారి వి.విశ్వేశ్వర రావు, నెరుసు నెలరాజు(బిజెపి),ఎస్.బాబూప్రసాద్(కాంగ్రేస్),డిఎన్‌విడి ప్రసాద్(సిపిఐఎం), సిర్రా భరత్,డి.రత్నబాబు(బిఎస్పీ), యు.బాలా నందం,ఎస్.అచ్యుత్ బాబు,టి.విష్ణు(టిడిపి),ఎ.రవి,పి.ఆదిశేషు(సిపిఎం) పాల్గొన్నారు.

**- నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు -** జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో 1,01,595 మంది పురుష ఓటర్లు, 1,04,930 మంది మహిళా ఓటర్లు,6 మంది,థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,06,531 మంది ఓటర్లుఉన్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 1,09,286 మంది పురుష ఓటర్లు,1,15,388 మంది మహిళా ఓటర్లు,8 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,24,682 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఏలూరు నియోజకవర్గంలో 1,12,308 మంది పురుష ఓటర్లు, 1,22,714 మంది మహిళా ఓటర్లు,46 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,35,068 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలవరం(ఎస్టీ) నియోజకవర్గంలో 1,22,959 మంది పురుష ఓటర్లు, 1,31,372 మంది మహిళా ఓటర్లు, 9 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,54,340 మంది ఓటర్లు ఉన్నారన్నారు. చింతలపూడి(ఎస్సీ) నియోజకవర్గంలో 1,34,294 మంది పురుష ఓటర్లు, 1,38,778 మంది మహిళా ఓటర్లు,40 మంది

- తరువాయి 2లో..



## సహకార సంఘాలలో అల్పాదాయ వర్గాలకు
# ప్రముఖ స్థానం

- అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం

**భీమవరం,మేజర్‌న్యూస్:** స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జరిగిన జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశంలో జిల్లాలో సహకార సంఘాల ప్రమోషన్,అవసరమైన భవిష్యత్ కార్యాచరణపై కమిటీ సభ్యులతో సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతం కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన కొత్త బహుళార్ధసాధక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు,పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాలను స్థాపించడం ద్వారా సహకార సంఘాలనుబలోపేతంచేసే ప్రణాళికను అమలు చేయవచ్చునన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, పాడి పరిశ్రమ,మత్స్య సహకార సంఘాలను స్థాపించడం ద్వారా సహకార సంఘాలను బలోపేతం చెయ్యవొచ్చని, తద్వారా గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లాలో 369 గ్రామ పంచాయతీల్లో 122 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వీటిలో42 సొసైటీలు బహుళ సేవలందిస్తున్నాయన్నారు. ఇప్పటికే ఉన్న వ్యవసాయ పరపతి సంఘాలు పరిధిలోకి రాని గ్రామ పంచాయతీలలో కొత్త బహుళ ప్రయోజన పరపతి సంఘాలను రానున్న కాలంలో ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికోసం నాబార్డు, సహకారశాఖ,పశు

- తరువాయి 2లో..

# నర్సాపురం కౌన్సిల్లో గందరగోళం

- ఇరుపక్షాలు వాగ్వివాదం





**నర్సాపురం,మేజర్ న్యూస్ :** మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వైసిపి, జనసేన కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం జరిగింది. అన్న క్యాంటీన్ ప్రారంభం రోజు కొంతమంది వ్యక్తులు ప్రజా ప్రతినిధుల ఫ్లెక్సీలు చించి వేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని గతంలోనే వైసీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ను కోరారు.ఈవిషయం ఇప్పటివరకు తేల్చకపోవటానికి కారణాలేంటిని, వారిపై ఎటువంటి

- తరువాయి 2లో..

# చేతిలో తెలంగాణ గ్యాస్ బుక్

**ఆంధ్రా గ్యాస్‌కు వచ్చింది అసలు చిక్కు**
**అత్యధికంగా తెలంగాణ గ్యాస్ బుక్కులు**
**అయోమయంలో లబ్దిదారులు**



**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా చీలిపోయి నూతనంగా తెలంగాణ రాష్ట్రంఏర్పడి పదేళ్లుపూర్తి అయింది.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు ముంపుకు గురవుతాయని ఈ రెండు మండలాలను పరిపాలన పరంగా అడ్డంకులు ఎదురవుతాయని కేంద్ర ప్రభుత్వం రెండు మండలాలను గతంలో ఆంధ్రారాష్ట్రంలో కలిపారు.

ఇదంతా జరగక ముందు నుండే తెలంగాణ రాష్ట్రం సారపాక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నుండి ఈ ప్రాంతాల్లో గ్యాస్ వినియోగం జరుగుతోంది. ఆంధ్రలో రెండు మండలాలను కలిపాక కుక్కునూరు మండల కేంద్రంలో ఆంధ్రాకు చెందిన గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేయడంతో ఆంధ్రా, తెలంగాణ రెండు రాష్ట్రాలనుండిరెండు మండలాలకు హెచ్‌పీ గ్యాస్ సరఫరా అవుతోంది.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో బాగంగా కుటుంబానికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్న వాగ్దానం ప్రకారం దీపావళి పండుగ రోజు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు.అయితే 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో 'శని అన్నచందంగాఏజెన్సీ ప్రాంతగ్యాస్ వినియోగదారుల పరిస్థితి నెలకొంది .మొదటి నుండి తెలంగాణ రాష్ట్రానికి చెందిన

- తరువాయి 2లో..

# రెక్కాడితేనే కానీ డొక్క నిండని హమాలీ కూలీల రేట్ల పెంపుదలకు సహకరించండి



పెద్దాపురం రూరల్ , మేజర్ న్యూస్ : జట్లు లేబర్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం అత్యవసర సమావేశం పెద్దాపురంలో స్థానిక జట్ల యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు గోకాడ బాబురావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏఐటీయూసీ పెద్దాపురం ఇంచార్జ్ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, కోశాధికారి కామిరెడ్డి బోడకొండ హాజరయ్యారు. తోకల ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రెక్కాడితేనే గాని డొక్క నిండని కార్మికులు హమాలీ కూలీలు. వారి జీవన వృత్తి నిరంతరం బరువులు మోయడమేనని, ఈ బరువులు మోసి మోసి వాళ్ళ మోకాలు, భుజాలు అరిగిపోతున్నయని, బరువులు మోసేటప్పుడు ప్రమాదాలు జరిగిన, అనారోగ్యానికి గురైన వారికి ఏ విధమైన ఆర్థిక భరోసా లేదని, హమాలీ కూలీలకు ప్రభుత్వం ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రసాద్ అన్నారు. పెద్దాపురంలో ఉన్న వర్తక వ్యాపారులకు, కార్మికులకు మధ్య వేతన ఒప్పందాలు రెండు సంవత్సరాలుగా ఒకసారి జరుగుతాయని, ఈ వేతన ఒప్పందాల పెంపుదలకు వర్తక వ్యాపారుల సహకరించి హమాలి కూలీలను ఆదుకోవాలని ప్రసాదన్నారు.

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటి యుసి ఆవిర్భవించి 105 సంవత్సరాలు అవుతుందని, 1920 అక్టోబర్ 31వ తేదీన ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, కార్మిక చట్టాలు,కనీస వేతనాలు అమలు,ఉద్యోగ భద్రతకై కార్మికుల శ్రేయస్సు కొరకై నిరంతరం పోరాటం చేస్తు మొట్టమొదటిగా ఏర్పడిన ఏకైక సంఘం ఏఐటీయుసి అని,ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఏఐటీయుసి అనుబంధ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బందారు అప్పారావు, బొట్ట శ్రీను, జి. చిన్ని, కొమ్మన శీను బాబు, కాంతారావు, వెన్నెల వీరబాబు, బొట్టా త్రిమూర్తులు, కొల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఇంచార్జ్ యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, యువ నాయకులు, అనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తనయుడు నల్లమిల్లి మనోజ్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం నియోజకవర్గ నాలుగు మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మనోజ్ రెడ్డి ఇంటి వద్ద ఉదయము నుండి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మనోజ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన కుమారుడు మనోజ్ రెడ్డికి కేకు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. తాత నల్లమిల్లి మూలారెడ్డి కి ఏ మాత్రం తీసుకోకుండా తండ్రి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ నిరంతరం ప్రజా సేవకై పరితపిస్తున్న యువ నాయకుడు, పార్టీకి, కార్యకర్తలకు, నాయకులకు నేనున్నానని ధైర్యాన్నిచ్చే నాయకుడు మనోజ్ రెడ్డి అని అనేక మంది అన్నారు. అనేక చోట్ల కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మూలారెడ్డి, రామకృష్ణారెడ్డి, మనోజ్ రెడ్డిల అభిమానులు పాల్గొన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికీ పేరుపేరునా మనోజ్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

### పిఠాపురం పాదగయ క్షేత్రంలో కార్తీకమాస ఏర్పాట్లు

**పిఠాపురం,మేజర్‌న్యూస్:** పరముఖ పుణ్యక్షేత్రం పాదయాక్షేత్రంలో కార్తీక మాస ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. పట్టణంలో వేంచేసియున్న శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ది 02 నవంబర్ 2024 వ తేది నుండి ది. 01 డిసెంబర్ 2024 వ తేది వరకు కార్తీకమాసం సందర్భం గా... భక్తుల సౌకర్యార్థం ఆలయము ఉదయం 4-00 గంటల నుండి మధ్యాహ్నం గం 1-30 ని.ఎల వరుకు, సాయంత్రం 4-00 గంటల నుండి రాత్రి 9-00 గంటల వరకూ భక్తుల సౌకర్యార్థం రద్దీని బట్టి ఆలయం తెరచి ఉంచబడునని పేర్కొన్నారు. భక్తులు స్నానములు ఆచరించుటకు పాదగయా పుష్కరిణి నీరు పూర్తిగా తొలగించి, ఎండగట్టి బ్లీచింగ్ వగైరా వేసిన తదుపరి కొత్త నీరు పెట్టడమైనదన్నారు. కార్తీకమాసము అనంతరము నీరును తొలగించెదమని, దేవాలయము బయట పరిసరములు పారిశుధ్యము నిమిత్తము కమీషనర్, పురపాలక సంఘము, పిఠాపురం వారికి లేఖ వ్రాయడము జరిగినదని, కార్తీకమాసము పర్వదినములలో దేవస్థాన ప్రాంగణములో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయమని కోరుతూ సూపరింటెండెంట్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, పిఠాపురం వారికి లేఖ వ్రాయడము జరిగినదని, బందోబస్తు మరియు ట్రాఫిక్ అంతరాయము జరగకుండా చూసేందుకు సర్కిల్ ఇనస్పెక్టర్, పిఠాపురం వారికి లేఖ వ్రాయడము జరిగినదని పేర్కొన్నారు.

ఆలయములో భక్తులకు త్రాగునీరు, చిన్న పిల్లలకు పాలు, ఉచిత ప్రసాదము ఏర్పాటు చేయడమైనదని, సెక్యూరిటీ గార్డులు, పాదగయా పుష్కరిణి చుట్టూ లైటింగ్, ఆడవారు బట్టలు మార్చు కొనుటకు తాత్కాలికముగా టెంట్లు, ఆలయము లోపల పారిశుధ్యము నిమిత్తము అదనముగా స్వీపర్లు, ఉచిత ప్రసాద వితరణ మరియు అన్నదానము భక్తులకు సరిపడిన రీతిలో ఏర్పాటు చేయడమైనదని ఆలయ కార్య నిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు.

# యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్‌కుమార్‌కు విసి మురళీకృష్ణ అభినందనలు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయు) ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 30వ తేదీ నుండి నవంబర్ 3వ తేదీ వరకు జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీ (మెన్)లకు పరిశీలకునిగా యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా. జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ న్యూఢిల్లీలోని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయు) ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి. మురళీకృష్ణ మంగళవారం విసి ఛాంబర్ నందు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ యూనివర్సిటీ కబడ్డీ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించి జెఎన్‌టియుకె యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.దక్షిణ భారతఅంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీ (మెన్)లకు పరిశీలకునిగా నియమితులైన డా.జి.శ్యామ్ కుమార్‌ను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కె.వి.ఎస్.జి.మురళీకృష్ణతో పాటు రెక్టార్ ప్రొ.కెవి.రమణ,ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు అభినందించారు.

# ఆవు దూడకు కృత్రిమ కాలు అమర్చిన సదాశివమూర్తి

మొదటిపేజీ తరువాయి

చూపించుకున్నారు. నిజంగా ఇది అభినందనీయం కదా! కాలు విరిగిన ఆవును వదిలేయకుండ అంత దూరం నుంచి శ్రమకోర్చి తీసికొని వచ్చిన ఆ రైతుబిడ్డ, భూతదయ చూపించినట్లే..తన మేథస్సుకు పదును పెట్టి ఆగోమాతకు ఉపశమనం కలిగించిన సదాశివమూర్తిని పలువురు అభినందించారు.

## ఏలూరు జిల్లాలో 16,38,436 మంది ఓటర్లు

మొదటిపేజీ తరువాయి

థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,73,112 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 1,18,063 మంది పురుష ఓటర్లు,1,20,863 మంది మహిళా ఓటర్లు,10 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,38,936 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 1,01,276 మంది పురుష ఓటర్లు, 1,04,486 మంది మహిళా ఓటర్లు,5 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,05,767 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

## సహకార సంఘాలలో అల్పాదాయ వర్గాలకుప్రముఖ స్థానం

మొదటిపేజీ తరువాయి

సంవర్థక,మత్స్యశాఖలని సమన్వయము చేసుకుంటూ జిల్లాలో పాల సంఘాలు,మత్స్యసహకారసంఘాలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు.ఈసమావేశం లో నాబార్డ్ డిడిఎం టి.అనిల్ కాంత్,సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ హనుమంతరావు,జిల్లామత్స్యశాఖఅధికారి ఆర్.వి.ఎస్ ప్రసాద్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, ఏపీ డైరీ మేనేజర్ ఎస్.సామ్రాజ్యం, డిసిసిబి జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపురం కౌన్సిల్లో గందరగోళం

మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకున్నారు తెలపాలని అన్నారు.ఈ విషయంపై అధికారులకు నివేదించామని ఆదేశాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కమిషనర్ వ్యాఖ్యలను సమర్థిస్తూ జనసేన కౌన్సిలర్లు మాట్లాడారు. కార్తీక మాసం సమీపిస్తున్నందున, రేవుల శుభ్రం చేయటం, వీధిలైట్లు బాగు చేయడం తదితర పనులు ఎందుకు చేయటం లేదని వైస్ చైర్మన్ కొత్తపల్లి నానిప్రశ్నించారు.ఒక దశలో వైసిపి, జనసేన కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు వాగ్వివాదం చేసుకున్నారు. పలు విషయాలపై వైస్ చైర్ పర్సన్ కామన నాగిని,కోటిపల్లి సురేష్,ఆడిదల శ్యామల,వై కే ఎస్ తదితరులు మాట్లాడారు.

## చేతిలో తెలంగాణ గ్యాస్ బుక్

మొదటిపేజీ తరువాయి

గ్యాస్ బుక్కులు కల్గిన అత్యధిక మంది వినియోగదారులకు పెద్ద చిక్కొచ్చి పడింది. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దీపం పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుకునేందుకు ఈ ప్రాంతాల గ్యాస్ వినియోగదారుల వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్యాస్ బుక్కులు అడ్డంకిగా మారాయి.ఆంధ్రలో ఉచిత గ్యాస్ పొందాలి అంటే తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్యాస్ బుక్కులు ఆంధ్రలోకి మార్చుకోవాలి.ఈ తతంగం అంతా జరగాలంటే రెండు మండలాల్లోని వినియోగ దారులు తెలంగాణ గ్యాస్ ఏజెన్సీ సారపాక కార్యాలయానికి చేరి కెవైసి చేయాల్సిన చిక్కు నెలకొంది. రెండు మండలాల్లో సుమారు 70 శాతం కుటుంబాలకు తెలంగాణ బుక్కులు ఉన్నాయి.వీరికి దీపం పథకం వర్తించే లా ప్రభుత్వం తగిన వెసులుబాటు కల్పించాలని వేడుకుంటున్నారు.దీపం పథకం ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఎకౌంట్లోకి ప్రభుత్వ సొమ్ములు జమా అవ్వడానికి గ్యాస్ బుక్కుల మార్పులు చేర్పులు అవసరం అవుతాయి.ఈ నేపథ్యంలో మండల కేంద్రము లో గ్యాస్ కేవైసీ ప్రక్రియ ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు.

## అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి - చైర్‌పర్సన్

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** అధికారులు అభివృద్ధిపై దృష్టిపెట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగ తాయారు సూచించారు. మంగళవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది.

# వై.ఎన్.లో సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకుల సదస్సు




**నర్సాపురం,మేజర్‌న్యూస్:** స్థానిక శ్రీ వై.ఎన్.కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో అయిదు మండలాల సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకులకు సదస్సును నిర్వహించారు.

మంగళవారం జరిగినఈ సదస్సులో సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని కె.బాలు సాధనమాట్లాడుతూ, నర్సాపురం, పాలకొల్లు, మొగల్తూరు, యలమంచిలి, పోడూరు మండలాల సచివాలయ సిబ్బంది అంతా ఈ సదస్సుకు హాజరైనందుకు సంతోషంగా ఉందని, ఇదే విధంగా మీ మండలాల మధ్య సమస్యలను పరస్పరం పరిష్కరించు కోవాలని చెబుతూ, మనం ఉచితంగా అందిస్తున్న డి.ఎస్.సి. శిక్షణ కొరకు తక్కువ సంఖ్యలో అభ్యర్థులు నమోదు చేసుకున్నారని,మిగిలిన వారిలో కూడా అవగాహన పెంచి ఎక్కువ మంది అభ్యర్థులు నమోదయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కువ మంది పరీక్షకు హాజరయ్యి ఉత్తీర్ణత సాధించేలా చేయాలని,సచివాలయ పరిపాలనా యంత్రాంగంలో ఎక్కడా రాజీ పడకుండా అన్ని పనులు వెంటనే చేసి ప్రజల మన్ననలను పొందాలని, విద్యార్థుల ఉపకార వేతనాల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని వెంటనే సరిచేసి విద్యార్థులకు అండగా ఉండాలనిఅన్నారు. ఉద్యోగుల ప్రాముఖ్యత స్థాయిలకు భంగం రాకుండా వ్యవహరించాలని, సెలవలు తీసుకునే విషయంలో క్రమశిక్షణను పాటించాలని, సర్వీస్ రిజిస్టర్ ను ఎలా నిర్వహించాలి,అందులో ఏ యే అంశాలను పొందుపరచాలి,దాని ప్రాముఖ్యతను గూర్చి తెలుపుతూ,ఇటీవల కాలంలో మండలాలలో జరిగిన బదిలీలలో వచ్చిన సిబ్బంది అక్కడి విధి విధానాలను ముందుగా తెలుసుకుని, తద్వారా వారి విధులను నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకటరత్నం, డీన్ డా.గంధం శ్రీ రామ కృష్ణ, పి.జి.అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఆర్. పార్థసారధి, సామాజిక సేవా సెంటర్ సమన్వయ కర్త బి.ప్రసాద్,చలపాక బాలరాజు,సాంఘిక సహాయ సిబ్బంది వినోద్, బాబు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దశలవారీగా హామీల అమలు : పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ షరీఫ్



**నరసాపురం,మేజర్‌న్యూస్:**ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ షరీఫ్అన్నారు. మంగళవారం పట్టణం లోని 16వ వార్డులో సభ్యత కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని,ముందుగా పెన్షన్లుపెంచి పంపిణీచేయటం జరిగిందన్నారు.గత ప్రభుత్వం రైతుల భూమి పట్టాలను రైతుకు హక్కు లేకుండాచేసిందని, ప్రత్యేక జీవో ద్వారా ఆసమస్య పరిష్కరించటం జరిగిందన్నారు.

వరుస క్రమంలో హామీలన్నీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో కృషి జరుగుతుందన్నారు.పార్టీఇంచార్జ్‌పొత్తూరిరామరాజు,పట్టణ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవీంద్ర ఠాగూర్,సంకుభాస్కర్‌నాయుడు,అధికారి అనంతరామారావు, ఎండి మౌలాలి,యూనిసా బేగం,నన్న షేక్ హుస్సేన్,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దీపావళి సామాగ్రి తయారు చేస్తున్న ఇద్దరు అరెస్ట్



కలిదిండి,మేజర్‌న్యూస్: పిల్లల నుండి పెద్దల వరకు ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని జిల్లా ఎస్పీఆదేశాలు స్పష్టంగాఉన్నా సరే లెక్కచేయకుండా అనుమతులు లేకుండా మందు గుండి సామాగ్రి అక్రమ తయారుచేస్తున్నారు.ఎస్పై రాబట్టిన సమాచారం మేరకు సిబ్బంది. మధ్యవర్తులను వెంటపెట్టుకొని కలిదిండి మండలం కొరుకొల్లు గ్రామంవెళ్లి అక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా దీపావళి మందు గుండు సామాగ్రి తయారీ చేస్తున్న చిన్నంశెట్టి వెంకట సత్యనారాయణ తండ్రి సుబ్బారావు వయసు 35 కోరుకొల్లు గ్రామం,చలమ శెట్టి సతీష్ తండ్రి నాగేంద్రబాబు వయసు 26 కోరుకొల్లు గ్రామం వారి వద్ద నుండి మందు గుండి టపాకాయలను స్వాధీనపరచుకొని వారిపై కేసు నమోదు చేసినారు.ఈనేపథ్యంలో మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా మందు గుండి సామాగ్రి (ఫైర్ క్రాకర్స్) తయారు చేసిన నిలవ ఉంచిన లైసెన్సు లేకుండా అమ్మకాలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పై వి.వెంకటేశ్వరరావుతెలియపరిచారు.ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనధికారికంగా బాణాసంచా ఇల్లు మధ్యలో నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పూర్యిఫైడ్ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి




**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం నియోజకవర్గం నందు దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం పలుచోట్ల జరిగిన అన్నదాన కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక వార్పు రోడ్డు,3 వ వార్డు, గణేష్ నగర్ కనకదుర్గమ్మ అమ్మవారి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం యర్రా నారాయణ స్వామి పాఠశాల నందు రెండు మూడు వార్డుల ప్రజలకు శుభ్రమైన మంచి నీళ్లు అందించాలని దృఢ సంకల్పంతో ఉచిత ప్యూరిఫైడ్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి చల్లారెడ్డి దంపతులు,పాలూరు వెంకటేశ్వరరావు, పుల్లా బాబి,పైబోయిన వెంకట్రామయ్య, గుండు మోగుల సురేష్,చేపల రమేష్, ఆడబాల మురళీ, బైనపాలెపు ముఖేష్, సందక రమణ, గట్టిం నాని,యువరపు సోముశేఖర్,అడప జమున, వెజ్జు రత్నకుమారి, మద్దాల లక్ష్మీ ప్రసన్న, కొల్లి రామావతి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు, ఫోక్సో చట్టంపై అవగాహన



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరుఫస్ట్‌సెక్టార్ పరిధిలోని ద్వారకా నగర్ కోడ్ నంబర్ 196 అంగన్వాడి కేంద్రం నందు సెక్టార్ మీటింగ్‌లో డిసిపివో సూర్య చక్రవేణి ప్రసంగించారు. బాల్యవివాహాలు,ఫోక్సో చట్టం,టీనేజ్ ప్రెగ్నెంట్,ట్రాన్స్ జెండర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ మంగ, జాహ్నవి,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10 నుండి కార్తీక వన సమారాధన జాతీయ ఉత్సవాలు



ద్వారకా తిరుమల,మేజర్‌న్యూస్: కార్తీక పౌర్ణమి నాడు జన్మించిన గౌడ్ కుల గోత్రం, గౌడ వంశ మూల పురుషుడు శ్రీ శ్రీ శ్రీ కౌండిన్య మహా హర్షి జయంతి జాతీయ వారోత్సవాలు నవంబర్ నెల 10వ తేదీ తెనాలిలో ప్రారంభమై 15 తేదీన ఉత్సవాలు హైదరాబాదులో ముగియనున్న ట్లు జై గౌడ్ ఉద్యమ రాష్ట్ర అధ్యక్షులు చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్ తెలిపారు. మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో మంగళవారం ఉదయం జై గౌడ్ జిల్లా అధ్యక్షులు పరసా వీర్రాజు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో వన సమారాధన ఆహ్వానం పత్రికను మండల గౌడ కుల పెద్దలకు అందరికీ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ మరియు గౌడ్ సంగీత ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ కంఠ మహేశ్వర స్వామి 9వ సంవత్సరం కార్తీక వన సమారాధన జాతీయ ఉత్సవములు నవంబర్ 10వ తేదీన తెనాలిలో నిర్వహించుటకు మనకుల పెద్దలు నిర్ణయించడమైనది.

కావున గౌడ సంఘీయులు, జైగౌడ్ ఉద్యమం అన్నివిభాగాలు నాయకులు,ఉద్యోగసంఘం నాయకులు, యువతులు, మహిళలు, అందరూ కుటుంబ సమేతంగా తప్పకుండా విచ్చేసి మనందరి ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయవలెనని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మిగతాచందు,మిడత రామకృష్ణ, వీరమల్లు కిషోర్ గౌడ్, గౌడ్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ రెండవ సెమిస్టర్‌లో ఛాంబర్స్ విద్యార్థుల ప్రభంజనం



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విడుదల చేసినరెండవ సెమిస్టర్ ఫలితాలలో చాంబర్స్ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులు 82శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 82శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలలు అతి తక్కువ అని, ఉత్తమ ఫలితాలు సాధనలో ఛాంబర్స్ కళాశాల మొదట ఉంటుందని అన్నారు. ఈ విధంగా 9.0నుండి 9.9 మధ్యలో గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు 92మంది అని తెలియజేశారు. కళాశాలలో అత్యుత్తమ బోధన , ప్రమాణాలు కొనసాగిస్తూ ఆధునిక సాంకేతిక విధానాలలో విద్యార్థులను తీర్చుదిద్దుటలోనూ నూతన విద్యావిధానం-2020 సక్రమంగా నిర్వహించుటలోనూ కళాశాల ముందంజలో ఉందని చైర్మన్ కెవిఆర్ నరసింహారావు తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ గ్రేడ్‌పాయింట్స్ సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు, సెక్రెటరీ కె.రామరాజు, అకాడమిక్ అడ్వైజర్స్ ఏబీఎన్ మూర్తి , నందుల సీతారామరావుప్రిన్సిపాల్ డాక్టర్.డి.వెంకటేశ్వరరావు,అధ్యాపకులు అభినందించారు.ఇంతఉత్తీర్ణతకు విద్యార్థులను తయారు చేసిన అధ్యాపకులకు కళాశాల యాజమాన్యంప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపినారు.

# జిల్లా అభివృద్ధిలో నైపుణ్య గణన గణాంకాలు ప్రముఖ పాత్ర

– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




భీమవరం,మేజర్ న్యూస్: జిల్లా అభివృద్ధిలో నైపుణ్య గణన గణాంకాలు ప్రముఖ పాత్ర పోషిస్తుంది అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరం నందు ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణన-2024 జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమంలో సచివాలయ సిబ్బందికి పిపిటి ప్రజెంటేషన్ ద్వారా వారు చేయాల్సిన విధులు, మరియు నైపుణ్యం యాప్ పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే యువత ఎక్కువగా ఉన్న దేశం భారతదేశం అన్నారు. వీరందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోతే సమస్యాత్మకంగా మారే అవకాశం ఉన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా దేశం తలసరి ఆదాయం పెరగడంతో పాటు, దేశం ఆర్థికంగా బలోపేతం అవుతుంది అన్నారు. నైపుణ్యం అనేది మనం నేర్చుకునే విద్యలో ఒక భాగం అని దానిని ప్రత్యేకంగా విభజించి చూడాల్సిన అవసరం లేదన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు గణనీ యంగా పెరగనున్నాయన్నారు. ఆటోమేషన్, కృత్రిమమేధ, ఆర్థిక వ్యవస్థ కీలకపాత్ర పోషించునున్నాయని, వీటి వల్ల కొత్త అవకాశాలతో పాటు కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రానున్నాయాన్నారు. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో రాగల మార్పు లకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ఉద్యోగాలు పొందడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి లోకమాన్, జిల్లా ఉపాధి అధికారి వరలక్ష్మి, డ్వామా పిడి డా. కెసిహెచ్ అప్పారావు, ఏపీఎస్ఎస్డిసిడిస్టిక్‌కోఆర్డినేటర్ ఏ.అక్షయ, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బడేటి చంటి వితరణ

– విద్యుత్ షాక్ గురైన యువకునికి రూ.50వేల సొంత డబ్బు అందజేత



ఏలూరు,మేజర్‌న్యూస్: కార్యకర్తల కు అన్నివిధాలా భరోసా కల్పించి, అండగా ఉండడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) ఉద్ఘాటించారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ తొలిసారి ఏలూరు విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏలూరు మల్కాపురంలోని ఆశ్రం ఆసుపత్రి కూడలిలో ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్‌తో గాయాలపాలై స్థానిక చైత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమ్మరిరేవుకు చెందిన తోట గంగధర్‌రావు అనే కార్యకర్తను ఎమ్మెల్యే చంటి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగానే తన ఔదార్యాన్ని చాటుకున్న ఎమ్మెల్యే,, బాధితుని కుటుంబ సభ్యులతో స్వయంగా మాట్లాడి, వారికి భరోసా కల్పిస్తూ 50వేల రూపాయల సొంతనిధులను తక్షణ సాయంగా అందించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అంతేకాకుండా పెద్ద మనసుతో ఆలోచించి గంగధర్‌రావుకు ఉచితంగా వైద్యం అందించాలని చైత్ర ఆసుపత్రి వైద్యులకు ఆయన సూచించారు. గంగాధర్‌రావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కూడా సాయం అందించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు పూజారి నిరంజన్, వంగలపూడి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# 9 మంది పేకాట రాయుళ్ల అరెస్టు



కామవరపుకోట,మేజర్ న్యూస్: డిఎస్పి యు రవిచంద్ర ఆదేశాలపై జంగారెడ్డిగూడెం ఇన్స్పెక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో తడికలపూడి ఎస్సై చెన్నారావుకి రాబడిన సమాచారం మేరకు కామవరపుకోట మండలం వడ్లపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై,సిబ్బందితో దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అదుపు లోనికి తీసుకుని వారి వద్ద నుండి 58,450 రూ.లను 7మోటర్ సైకిల్ లను స్వాధీనం చేసుకొని సదరు 9మంది పై తడికలపూడి పోలీస్స్టేషన్లో కేసు నమోదు చేసినట్లుగా తడికలపూడి ఎస్సై చెన్నారావు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా తడికలపూడి ఎస్సై మాట్లాడుతూ పాల్పడుతూ పేద ప్రజలను ఆర్థిక ఇబ్బందులు కలగజేసే పేకాట కోడిపందాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా కోడిపందాలు పేకాటలు నిర్వహిస్తే సదరు సమాచారాన్ని డయల్ 112కుగాని లేదా 9440796678 కు సమాచారం తెలపవచ్చున్నారు.

# యాక్ట్ సంస్థ సేవలకు ఎమ్మెల్యే చంటి ప్రశంసలు

– రూ.15 లక్షలతో 125 బెడ్లు అందించడం అభినందనీయం



ఏలూరు,మేజర్ న్యూస్: తమ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటూ, సమాజ సేవా కాంక్షను ఒక్కత్రాటిపైకి తెచ్చి యాక్ట్ సంస్థ ముందుకు తీసుకెళ్ళడం అభినందనీయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రశంసించారు. కేబుల్, ఇంటర్‌నెట్ రంగాల్లో దేశస్థాయిలో తన పేరును సుస్థిరం చేసుకున్న యాక్ట్ సంస్థ అదేస్థాయిలో సమాజ సేవల్లో కూడా విశేష కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. ఇదేక్రమంలో ఏలూరులోని జిల్లా సర్వజనాసుపత్రికి రోగుల సౌకర్యార్థం పడకలు అందించే విషయాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి యాక్ట్ సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకురాగా తక్షణం స్పందించిన యాక్ట్ డిజిటల్ హెూమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ దాదాపు 125 పడకలను అందించేందుకు సంసిద్దత వ్యక్తం చేసి వాటిని అందజేసింది. ఈ పడకలను ఏలూరు సర్వజనాసుపత్రిలో మంగళవారం ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించి, ఆసుపత్రి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ జిల్లా సర్వజనాసుపత్రిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. తాను అడిగిన వెంటనే తక్షణం స్పందించి సుమారు 15లక్షల రూపాయల విలువైన 25 ఎమర్జెన్సీ పడకలను, 100 సాధారణ పడకలను రోగుల సౌకర్యార్థం అందించడం అభినందనీయమన్నారు. గతంలో కరోనాలో రూ.20 లక్షలతో ఆసుపత్రికి ఆక్సిజన్ ప్లాంట్ ను బహూకరించిన యాక్ట్ సంస్థ యాజమాన్యానిదేనన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సర్వజనాసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక శ్రద్ధకనపరుస్తున్నారన్నారు. యాక్ట్ ఆపరేషన్స్ హెడ్ బి.వి.సుబ్బారావు మాట్లాడుతూ తమ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటూ, సమాజ సేవలో కూడా యాక్ట్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. భవిష్యత్తలో కూడాసేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు తమ సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం,ఎస్సెమ్మార్ పెదబాబు,నాయకులు పూజారి నిరంజన్, బెల్లపుకొండ కిషోర్, త్రిపర్ణ రాజేష్, ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ సిహెచ్ దుర్గాకుమార్, ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి. శ్రీనివాసరావు, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లిఖార్జునరావు, యాక్ట్ సంస్థ జనరల్ మేనేజర్ టి.సీతారామారావు, యాక్ట్ సీనియర్ మేనేజర్ పి.కిషోర్ కుమార్,యాక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మంతెన పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం మద్దతు ధర కోసం ఉద్యమం

– కేరళ తరహాలో ధాన్యానికి ధర కల్పించాలి



ఉంగుటూరు కైకరం,మేజర్‌న్యూస్: ప్రభుత్వం చెప్పే దానికి ఆచరణకు పొంతన ఉండడం లేదు.. పెట్టుబడి ఖర్చులకు తగిన విధంగా మద్దతు ధర పెంచడం లేదని,ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ విమర్శించారు. క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. మంగళవారం ఉంగుటూరు మండలం కైకరంలోని తూర్పువీధి రామాలయం ఎల్.ఐ.సి కళ్యాణ వేదిక వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ధాన్యం మద్దతు ధర-కొనుగోలు సమస్యలపై జిల్లాస్థాయి రైతుసదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు అధ్యక్షత వహించారు. ధాన్యం మద్దతు ధర, కొనుగోలు సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు.ధాన్యం మద్దతు ధర కోసం ఉద్యమించాలని జిల్లా సదస్సు పిలుపునిచ్చింది. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు సమస్యలు పరిష్కరించి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం,ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులసంఘం నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కోనా శ్రీనివాసరావు, సున్నా వెంకట్రావు, దూడే కేశవ,వానపలి సత్యనారాయణ,చిత్తా వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఈసదస్సులోఉంగుటూరు,నిడమర్రు, భీమడోలు, దెందులూరు, ద్వారకాతిరుమలమండలాల రైతులు,కౌలు రైతులు పాల్గొన్నారు.

## కొల్లేరు బిసి నేత గృహాన్ని ముట్టడించిన టిడిపి శ్రేణులు



ఏలూరు,మేజర్ న్యూస్: కొల్లేరు బిసి నేత,వైఎస్ఆర్ నాయకుడు మోరు రామరాజు గృహాన్ని ముట్టడించిన వడ్డిగూడెం గ్రామ ప్రజలు,పలువురు టిడిపి శ్రేణులు,వడ్డిగూడెం గ్రామంలో ఆయన ఆక్రమనలో ఉన్న భూమిని ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని గ్రామ టిడిపి శ్రేణులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కట్టా సుబ్బారావు తోటలో ఉన్న రామరాజు గృహం వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల రంగ ప్రవేశంతో సమస్య సద్దుమణిగింది.

## సీఎంకి వరద సహాయార్థం రూ 97,52,780 విరాళం

– ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖరంను గెలిపించుకుందాం : ఎమ్మెల్యే



భీమవరం,మేజర్‌న్యూస్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు భీమవరం నియోజకవర్గం నుంచి రూ.97,52,780లు దాతలు విరాళంగా అందించారని, దీపావళి పండుగ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడారు.

అందరూ అందించిన విరాళాలు రూ.97,52,780లను సీఎంకు నేరుగా అందిస్తామని అన్నారు. భీమవరం - లోసరి,భీమవరం - పిప్పర రొడ్డుల అభివృద్ధికి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సుమారు రూ 100 కోట్లు మంజూరు చేశారని, హైవేలకు అనుసంధానంగా ఈ రోడ్డులను అభివృద్ధి చేస్తున్నారని- ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించుకుందాం - ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించుకుందామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరూ ఓటును నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, నవంబర్ 6న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వర్రావు, పొత్తూరిబాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ,కారుమూరి సత్యనారాయణమూర్తి, చల్లారాము,ొ ఒడ్డిసత్తిబాబు,నాగిడిసూర్య తదితరులు పాల్గొన్నారు.

# సంగీత, నృత్య సమ్మేళనంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

– అభినందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి



**భీమవరం,మేజర్ న్యూస్:** అంతర్జాతీయ సంగీత నృత్య సమ్మేళనంలో ప్రథమ స్థానంలో నిలిచిన భీమవరం విద్యార్థుల బృందం మంగళవారం జిల్లా కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిశారు. అక్టోబర్ 13న అంతర్జాతీయ నృత్య సంగీత సమ్మేళనం తెలంగాణ రాష్ట్రం చిక్కడపల్లి త్యాగరాజ గాన సభలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో 9 జిల్లాల కళాకారులు పాల్గొనగా కూచిపూడి నృత్య విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కడలి భాను శ్రీ మాస్టారు ద్వారా శిక్షణ పొందిన బృందం మూడు విన్యాసాల్లో మూడు ప్రథమ బహుమతులను గెలుచుకోవడం జరిగింది. కడలి భాను శ్రీ జాతీయ స్థాయిలో కళాకారిణిగా రాణించడంతోపాటు పలువురకు శిక్షణను అందిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వివిధ అంశాల్లో కూడా ప్రవేశం, ప్రావీణ్యం సంపాదించి మెరుగ్గా రాణించాలన్నారు. 9జిల్లాల కళాకారులు పోటీపడిన సందర్భంలో మన జిల్లాభీమవరంవాసులు ప్రథమ బహు మతులను గెలుచుకోవడంఎంతోసంతోషదాయకమని తెలియజేస్తూ,వారి బృందానికి, నాట్యం నేర్పిస్తున్న టీచర్ ను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు హాజరయ్యేలా ప్రోత్సహించిన శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంలో కడలి భాను శ్రీ మాస్టారును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శాలువా కప్పి అభినందించారు.

## విద్యార్థులే రేపటి మార్గదర్శనానికి దిక్సూచి

– వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి





**ద్వారకాతిరుమల,మేజర్న్యూస్:** వసంత నగర్ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాల సైన్స్ వెల్ఫేర్ విద్య వైమానిక ప్రదర్శన కార్యక్రమం అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొని మూడు జిల్లాల నుండి వచ్చిన53 గ్రూపుల విద్యార్థులు నిర్వహించిన పరిజ్ఞాన పరికరాలను చూసి విద్యార్థులను అడిగి తెలుసుకుని వాటిపై విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు.నేటి విద్యార్థులే రేపటి మార్గదర్శనానికి దిక్సూచి అనిఆయన విద్యార్థులను కొనియాడారు. ఈ కార్యక్రమంలోవివిధపాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు,మండల అధికారులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, పాల్గొన్నారు.

## రీ సర్వే ద్వారా యజమానికి భూమిపై హక్కు

– ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



**మొగల్తూరు,మేజర్న్యూస్:** భూములను రిసర్వే చేయించుకోవడం ద్వారా ఆ భూమిపై యజమానికి హక్కు ఏర్పడుతుందని, ఎన్నో ఏళ్లుగా సమస్యలలో ఉన్న భూములు వాస్తవ హక్కుదారునికి లభిస్తాయి అనిఎమ్మెల్యే బొమ్మిడినాయకర్అన్నారు. మంగళ వారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలోజరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమస్యలపై గ్రామస్తులతో చర్చిస్తూ ఇబ్బందులను తెలుసుకున్నారు. వాటిపై అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. కొల్లాటి గోపి కృష్ణ,వలవల నాని,నిప్పులేటి తారకరామారావు, బందేల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్,బొక్క చంటి,దాసరి కృష్ణాజి, దూసనపూడి సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ కొప్పాడి నాగరాజు,ప్రభుత్వ అధికారులు, జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత : ఒకరి అరెస్ట్



వేలేరుపాడు,మేజర్న్యూస్ : మండల పరిధిలోని గుళ్ళవాయి గ్రామంలో మంగళ వారం అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు.ఆకుల వేంకటేశ్వర రావు అనే వ్యక్తి వద్ద 30 తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్వార్టర్ మద్యం బాటిళ్లు నిందితుడి ఇంటి వద్ద బైక్ నుండి దించుతుండగా పట్టుకున్నారు.మోటార్ సైకిల్ నం.(టీయస్ 04ఈఏ 0504)ను స్వాదీనం చేసుకున్నారు.కుకు నూరు సీఐ రమేష్ బాబు సారథ్యంలో వేలేరుపాడు యస్ఐ రామారావు ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ దానియేలు సిబ్బందితో కలిసి ఈ దాడులు నిర్వహించారు.నిందితుడి పై కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం కల్గి కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడవద్దని,మద్యం అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ రమేష్ బాబు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## బాస్కెట్ బాల్ విజేతలను అభినందించిన స్వర్ణాంధ్ర యాజమాన్యం



**నర్సాపురం రూరల్, మేజర్న్యూస్ :** భీమవరం ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 26,27తేదీలలో జరిగిన జెఎన్టియుకె సెంట్రల్జోన్ బాస్కెట్బాల్ టోర్నమెంట్ పురుషుల విభాగములో స్వర్ణాంధ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమస్థానం సాధించారు.స్వర్ణాంధ్రఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి కె.కుమార్ రవితేజరెడ్డి(ఇ.సి.ఇ 4వ సంవత్సరం) జెఎన్టియు కెబాస్కెట్ బాల్ జట్టుకి ఎంపిక అయ్యాడు. ఇతని సారధ్యములో నవంబరు 1నుండి 5వ తేదీవరకు క్రైస్ట్ యూనివర్సిటీ, బెంగళూరులో జరుగుసౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారు .మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో విద్యార్థులను ఛైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వి.స్వామి ,డైరెక్టర్అడ్డాలశ్రీహరి,పులపర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.గోపీచంద్, ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.పి.పండరీనాథ్ అన్నీ విభాగాధిపతులు, డైరెక్టర్ కె.ఎస్.వి.యస్.ఎన్.మూర్తి ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలిపారు.

# రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం





– ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి,జెసి రాహుల్

**తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్:** రైతులకు సంక్షేమాలు అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తుందని ఆదిశగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెద్ద తాడేపల్లి వద్ద జిల్లాలోని మొట్టమొదటిసారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రవాణా దగ్గర నుంచి కూలీల వరకు అంతా ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. మిల్లర్లు కూడా రైతులను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా వారు తెచ్చిన ధాన్యాన్ని సేకరించాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతులకు సొమ్ము జమవుతుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు చోటు ఇవ్వకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ జరగాలని అధికారులకు సూచించారు. వ్యవస్థను సమూలంగా మార్చాలంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటిని అధిగమించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ఎవరికైనా రైతులు ఇబ్బంది పడితే అధికారులంతా అలర్ట్ గా ఉండాలని ఏ చిన్న అలసత్వం వహించిన సహించేది లేదని హెచ్చరించారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తిన రైతులకు తాను అండగా ఉంటానని ఏ సమయంలో అయినా తనకు రైతులు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతుల అన్నవరం, టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్,ఆర్డీవో కటీఫ్ కౌసర్భనో, పుల్లా బాబి, నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు,పసుమర్తి రామ్ లక్ష్మణ్,ఎంపీటీసీలు గోవింద్, సత్యనారాయణ,ప్రభుత్వ అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సారవ,వైఎస్ పాలెంలలో పొలం పిలుస్తోంది



**నర్సాపురంరూరల్,మేజర్న్యూస్ :** మండలంలోని సారవ, వైఎస్.పాలెం రైతు సేవా కేంద్రాల పరిదిలో పోలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిల్ కుమారి మాట్లాడుతు వరిలో మేలైన యజమాన్య పథతులు అయిన పురుగు మందులవాడకం,కలుపు యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కలిగించారు.వ్యవసాయ అధికారి శామ్యూల్ జాన్సన్ మాట్లాడుతు వరిలో ఎరువుల యజమాన్యం గురించి ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించీ రైతులకు తెలియ చేసారు. బుధవారం లక్ష్మణేశ్వరం 1,లక్ష్మణేశ్వరం 2 రైతు సేవా కేంద్రాల లో పోలం పిలుస్తోంది కార్యక్రమము నిర్వహిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వి.ఎ.ఎ.లక్ష్మీకాంతం , దీప్తి యర్రంశెట్టి బాబులు, బల్ల నరేష్, కడలి పెద్దిరాజు,గన్నాబత్తుల దుర్గా ప్రసాద్,సిద్దినీడి శివరామయ్య పిన్నమరాజు శ్రీనివాస రాజు తధితరులు పాల్గొన్నారు.


# 140 మంది పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

**- సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**




**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా ఏలేరు పాడు మండలం తాటికూరు గొమ్ము పంచాయితీ జగన్నాధపురం గ్రామానికి చెందిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు 140 మందిని ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ లిస్టులో చేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగ్రామస్తులు కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఏలేరుపాడు మండలం తాటికూరు గొమ్ము పంచాయతీ జగన్నాధపురం గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితులు 335 మందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అవార్డు ఇచ్చి ఉన్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. అవార్డు ఇచ్చిన 335 కుటుంబాలలో 140 కుటుంబాలను అధికారులు నిర్లక్ష్యంగా ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ లిస్టులో నుంచి తొలగించారని వారు ఆరోపించారు. తొలగించిన 140 కుటుంబాల వారిని ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ లిస్టులో చేర్చకపోతే లబ్ధిదారులతో కలిసి సిపిఐ పోరాడుతుందని వారు హెచ్చరించారు. సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ గడచిన ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు ఏలేరుపాడు కుక్కునూరు మండలాలతో పాటు మిగిలిన మండలాల రైతులు గిరిజనులు ప్రజలు అనేక త్యాగాలు చేసి అనేక నష్టాలు పాలు ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరిస్తున్నారని ఓ పక్కన పేర్కొంటూ మరో పక్కన నిర్వాసితులకు న్యాయం చేయకుండా అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్,సిపిఐ జిల్లా సమితి సభ్యులు కేవరప్రసాద్, జగన్నాధపురం పోలవరం నిర్వాసితులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లుతున్న డిఆర్ఓ పుష్పమణికి ఆత్మీయ వీడ్కోలు



ఏలూరు,మేజర్‌న్యూస్: స్పష్టమైన ఆలోచన,విషయంపట్ల అవగాహనతో సహ ఉద్యోగులతో సమర్థవంతంగా డిఆర్ఓ డి.పుష్పమణి విధులు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లుతున్న డి.పుష్పమణికి వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను ఎన్నికల నిర్వహణలో కూడా నిబద్ధత, జవాబుదారితనంతో పనిచేసినట్లు తమ తెలిసిందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు సమయంలో డిఆర్ఓగా మంచి సర్వీసు అందించారని కలెక్టర్ కొనియాడారు. డిఆర్ఓ డి.పుష్పమణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లు,రెవిన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఎన్నికల సమయంలో తనకు ఎంతో ప్రోత్సాహం అందించారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పుష్పమణికి పుష్పగుచ్చాలు,శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. సభలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిప్యూటీ కలెక్టర్లు, ముక్కంటి, దేవకిదేవి, ఎస్డి సి కె.భాస్కర్, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్స్ పర్యవేక్షకులు,సిబ్బంది,పాల్గొన్నారు.

## 25 మంది చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల రక్తదానం



**ఏలూరు,మేజర్ న్యూస్:** విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడు లోని చైతన్య గోదావరి గ్రామీణ రీజినల్ బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 25 మంది బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారని రెడ్ క్రాస్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా రక్త దానం చేసిన ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. రీజనల్ మేనేజర్ యు.శ్రీదేవి మాట్లాడుతూ భారతదేశం అవినీతిరహిత దేశంగా ఏర్పడాలని ఉద్దేశంతో,ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించే విధంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడి బి.కిషన్,డాక్టర్ ఆర్ ఎస్ ఆర్ కె వర ప్రసాదరావు, పి ఆర్ ఓ కే వి రమణ తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సొంగ రోషన్

**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీలఅభివృద్దేప్రభుత్వ ధ్యేయం. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం ప్రజలకు అందిస్తుంది.ప్రజా సంక్షేమమే చంద్రన్న పాలన..కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వానికి సహకరించండి అని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెం పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే ఎదుట పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ముఖద్వారం జంగారెడ్డిగూడెం పట్టణం.పట్టణాన్ని సుందర వనంగా చేయండి .మున్సిపల్ సమస్యలు చాలా ఉన్నాయి.. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేయాలనీ కోరిన కౌన్సిలర్లు.పట్టణంలో పలు సమస్యలు పరిష్కారం కావట్లేదని ఎమ్మెల్యేకి గోడును విన్నవించుకున్న కౌన్సిలర్లు .అజెండాలు పెట్టడం తప్ప పనులు జరగట్లేదు అని ఆవేదన.పట్టణంలో రోడ్లు , డ్రైనేజీ విద్యుత్ దీపాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు అని కౌన్సిలర్లు పేర్కొన్నారు.వీధి కుక్కలతో మరింత ఇబ్బందికరంగా మారిన పట్టణంలో పరిస్థితి.పట్టణంలో అక్రమ లేఅవుట్‌కు పర్మిషన్లు ఇస్తున్న అధికారులు. .పట్టణానికి నాలుగు వైపులా సెంటర్ డివైడర్ లైటింగ్ కావాలని ప్రపోజల్ పెట్టిన కౌన్సిలర్ నంబూరి రాజు లింక్ సీసీ రోడ్లు కావాలని, నిధుల విడుదలకు ఎమ్మెల్యేగా మీసహకారం కావాలని కోరిన కౌన్సిలర్లు.కౌన్సిలర్ల ఆవేదన సావధానంగా విన్న ఎమ్మెల్యే సొంగ రోషన్



కౌన్సిలర్ల ఆశించిన రహదారుల అభివృద్ధి పనులకు నిధులకేటాయింపుపై కమిషనర్‌కు సూచించారు.మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించబడిన రూ.4.7కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. జంగారెడ్డిగూడెం మండలం, పట్టణఅభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సమర్పించానని త్వరలో పట్టణ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు ప్రభుత్వపరంగా జరుగుతా యని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు.

## బిజెపి నేత వీరా కనకరాజు ఇకలేరు



పాలకొల్లు,మేజర్‌న్యూస్:భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది వీరా జయ రామాంజనేయులు (వీరాజీ) తండ్రి వెంకట కనకరాజు (78)ఇటీవల వయోభారంతో మరణించారు. ఆయన జిల్లా పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య,ఒక కుమార్తె,కుమారుడు ఉన్నారు. ఆయన మరణం పట్ల పలు రాజకీయ నాయకులు, న్యాయవాదులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు. వీరాజీని కలసి పరామర్శిస్తున్నారు.

## ఘనంగా జనసేన నేత పసుపులేటి రాము జన్మదిన వేడుకలు





జీలుగుమిల్లి,మేజర్ న్యూస్: జీలుగుమిల్లి మండల యువ నాయకులు, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము జన్మదిన వేడుకలు ఆయన ఇంటి వద్ద మంగళవారం ఘనంగా జరిగాయి. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరై రాముకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని జనసైనికులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేసి రాముకు శుభాకాంక్షలు తెలియజేశారు. సీనియర్ నాయకులు కరాటం రాంబాబు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి ఫోన్ లో శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మాట్లాడుతూ తాత గారైన పసుపులేటి సూర్యనారాయణ (మునసూబ్) వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న యువ నాయకుడు రాము అని కొనియాడారు. యువకుడైన రాము జనసేన పార్టీలో ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. రాము మరిన్ని ఉన్నత పదవులు పొంది ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. రాముకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో పసుపులేటి ప్రసాద్, నాలి శ్రీను, టిడిపి మండల అధ్యక్షులు సుంకుమల్లి సాయి, గూడపాటి అరుణ్ కుమార్, చిర్రి వెంకటేశ్వరరావు పలువురు అధికారులు, జనసేన పార్టీ శ్రేణులు ఉన్నారు.

## ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తల్లి ,బిడ్డ మృతి

**- మృతురాలి బంధువుల ఆరోపణలు**



**చింతలపూడి,మేజర్ న్యూస్:** చింతలపూడి పట్టణంలో సాయి స్ఫూర్తి హాస్పిటల్ డాక్టర్స్ నిర్లక్ష్యానికి తల్లి బిడ్డ మృతి,పురిటి నెప్పులతో 26 వ తేదీ రాత్రి సాయి స్ఫూర్తి హాస్పిటల్ లో జాయిన్ అయిన వెంకటాపురం గ్రామానికి చెందిన కోదూరి పరిమళ కిరణ్ అనే గర్భవతి, అర్ధరాత్రి ప్రసవం చేయటం తో పురిట్లోనే బిడ్డ మృతి చెందింది. తల్లికి తీవ్ర రక్త స్రావం కావటంతో 28వ తేదీ తెల్లవారు ఝామున విజయవాడ ఆంధ్ర ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం 11 గంటలకు విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో తల్లి పరిమళ కిరణ్ మృతి చెందింది.

సాయి స్ఫూర్తి హాస్పిటల్‌లో డాక్టర్ లేకుండానే ప్రసవం చేశారని బందువులు ఆరోపణ.సాయి స్ఫూర్తి హాస్పిటల్‌లో జిల్లా వైద్యాధికారులు తనిఖీ ఆశా వర్కర్లు,స్థానిక నర్సులు డబ్బులకు ఆశపడి ప్రవేటు ఆసుపత్రులకు రోగులను పంపుతున్నారని ఆరోపించిన మృతురాలు బంధువులు.

# నిర్వాసితులకు న్యాయం చేయండి

**– ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌తో ఎమ్మెల్యే బాలరాజు బేటి**



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** నిర్వాసితులకు న్యాయం చేయండి అంటూ పోలవరం ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రాంసుందర్ రెడ్డినీ పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. మంగళవారం విజయవాడలోనే కమిషనర్ కార్యాలయంలో నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు చిర్రి బాలరాజు ప్రకటనలో పేర్కొంటూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లో వెలేరుపాడు మండలానికి చెందిన గ్రామాల ప్రజలకు అన్యాయం జరిగిందని వివరించారు. సొంత ఇంటిని, సేద్యం చేసే భూమిని, ఉండే ఊరిని ఇలా సర్వస్యం త్యాగం చేస్తే సర్వేల పేరుతో న్యాయ పరంగా రావలసిన ప్యాకేజీలు రాకుండా నిర్వాసితుల జాబితాలో పేర్లు తొలగించడంతో వారు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తట్కూరుగోమ్ము గ్రామ పంచాయితీ లోని జగన్నాధపురం గ్రామం లో 2017లోనే సర్వే చేసి డ్రాక్యుమెంటేషన్ చేసి 2019 లో గ్రామ సభ పెట్టి 335 ఇళ్లకు అవార్డు పాస్ చేసి యాజమానుల దగ్గర సంతకాలు తీసుకున్నారు. ఈనెల 24 తేదీన ఉన్నతాధికారులు విడుదల చేసిన జాబితాలో 140 ఇళ్ళను తొలగించి నిర్వాసితులకు తీరని అన్యాయం చేశారని తెలియజేసారు. తొలగించిన ఇళ్లను పరిశీలన చేసి మళ్ళీ ఆమోదం తెలిపి అవార్డు పాస్ చెయ్యాలని విన్నవించారు. మండలంలో ప్రతీ గ్రామ సచివాలయంలో అవార్డు పాస్ చేసిన లిస్టును అందుబాటులో ఉంచాలని కోరారు. ఇంటివిలువలు తక్కువ పడ్డాయని 2019లోదరఖాస్తు పెట్టిన ప్రతీ ఒక్కరి దరఖాస్తు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. గిరిజనులకు భూమికి బదులు భూమి ఇచ్చిన పొలాల్లో సరిహద్దులు నిర్ణయించక పోవడం వలన గిరిజనులు అంతా ఉమ్మడిగా తమ పోలలను దళారులకు తక్కువ కౌలుకు ఇచ్చి లక్షల్లో నష్టపోతున్నారనీ వివరించారు. కావున వారికి సరిహద్దులు నిర్ణయించలని కోరారు.దీనికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలేరుపాడు జనసేన మండలఅధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు ములకలపల్లి నరసింహారావు, సీపీఐ మండల కార్యదర్శి బడిశా రాము,సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జీలుగుమిల్లి మండల కార్యదర్శి కట్టం ముత్యలరావు, జనసేన ప్రధాన కార్యదర్శి కొవ్వాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 31 నుండి దీపం పధకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు





**– తెల్లరేషన్ కార్డుదారులకు ఏడాదికి 3 సిలిండర్లు**

**– కంట్రోల్ రూమ్ నెం.7702003584,టోల్ ఫ్రీ నెం.18004256453**

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో అక్టోబరు 31 నుండి రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు చేపడుతున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు పకడ్బందీగా పంపిణీ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని గౌతమీ సమావేశ మందిరంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ పంపిణీ ప్రక్రియపై సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో ఏజెన్సీలు , అధికారులు అవగాహన కలిగియుండాలని తెలిపారు. సిలిండర్ల బుకింగ్, పంపిణీలో సమస్యలు ఎదురైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు లబ్ధిదారులకు పూర్తిసమాచారం వారికి అందించాలన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం. 7702003584 ,టోల్ ఫ్రీ నెం. 18004256453కి ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చునన్నారు. కరపత్రాలను ముద్రించి గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రజలకు విరివిగా అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ పథకం ప్రకారం 2024 అక్టోబర్ 31 నుండి2025 మార్చి నెలాఖరు వరకు సిలిండర్ బుక్ చేసుకునే వారికి సిలిండర్ ఉచితంగా వస్తుందన్నారు. ముందుగా గ్యాస్ లబ్ధిదారులు డబ్బులు చెల్లించాలని తరువాత అతని బ్యాంక్ అకౌంట్‌కి గ్యాస్ అమౌంట్ జమ అవుతుందన్నారు. సమావేశంలో హెచ్ పిసిఎల్ అధికారి వెంకటేశ్వర్లు, డిఎస్ఓ ఆర్.ఎస్.ఎస్.రాజు, ఎంఎస్ఓ ప్రతాప్ రెడ్డి, జిల్లాలోని హెచ్ పి గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి పార్థసారథి

**– 24 గంటలలోనే బాధితులకు లభించిన ఆర్థిక సహాయం**

**– మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం**



**నూజివీడు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డి పల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు భార్యాభర్తలు మరణించిన ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి చొరవతో 24 గంటల వ్యవధిలోనే విజయ డైరీ సంస్థ ద్వారా రూ.2.50 లక్షల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసి అండగా నిలబడటం పట్ల బాధిత కుటుంబ సభ్యులు మంత్రి పార్థ సారథి కృతజ్ఞతలు తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండా రామారావు, ప్రశాంతి దంపతులు తమ పశువులను నీటి కోసం శనివారం సమీప చెరువులోకి తీసుకు వెళ్ళగా, వాటి కోసం చెరువులోకి దిగి భార్యాభర్తలు ప్రమాద వశాత్తు మృతి చెందారు. అయితే ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెంటనే తన కార్యాలయ సిబ్బందిని, అటు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఘటన ప్రాంతానికి చేరుకుని సహాయ చర్యలు పర్యవేక్షించాలని ఆదేశించారు. మృతుల కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రమాదం జరిగిన రోజే రూ.25,వేల రూపాయలను మట్టి ఖర్చుల నిమిత్తం భాదితా కుటుంబానికి మంత్రి పార్థ సారథి వ్యక్తిగతంగా అందించేలా ఏర్పాటు చేసి అండగా నిలిచారు.

ప్రమాద ఘటన జరిగిన 24 గంటల వ్యవధిలోనే విజయ డైరీ సంస్థ ద్వారా మరో రూ.2.50.లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేయడంతో మృతుల కుటుంబ సభ్యులు వారి బంధువులు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చందు,తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**కుక్కునూరు,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని సీతారామ నగరం గ్రామానికి చెందిన బొల్లా సంతోష్ అనే యువకుడు (27) సోమవారం తెల్లవారుజామున ఆ గ్రామ శివారులో అనుమాన స్పదంగా మృతి చెంది ఉండటంతో అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై రామకృష్ణ విలేకరులకు తెలియజేశారు.

## ఉచిత సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జెసి



**భీమవరం,మేజర్ న్యూస్:** స్థానిక కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు మంగళవారం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ పై సంబంధించిన అధికారులు, జిల్లాలో గ్యాస్ పంపిణీ దారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్పిజి కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి ఆధార్ మరియు బ్యాంక్ ఎకౌంటు వివరాలు గ్యాస్ కనెక్షన్ వివరాలుతో అనుసంధానమై ఉండాలన్నారు. దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేయనున్నదని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 31, 2024 నుండి 31 మార్చి 2025 మధ్యకాలంలో ఒక సిలిండర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ ఒకటి 2025 నుండి 31 జులై 2025 మధ్యకాలంలో మొదటి సిలిండర్, ఆగస్టు ఒకటి 2025 నుండి 31 నవంబరు 2025 మధ్యకాలంలో రెండవ సిలిండర్, డిసెంబర్ ఒకటి 2025 నుండి 31 మార్చి 2026 మధ్యలో మూడవ సిలిండర్ లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఎన్ సరోజ, ఐఓసి ప్రతినిధి ఎంవివి ప్రసాద్, ఏఎస్ఓ రవిశంకర్, జిల్లాలోని గ్యాస్ పంపిణీదారులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు భరోసా కల్పించే పార్టీ టిడిపి : మాజీ ఎమ్మెల్యే బండారు



**మొగల్తూరు,మేజర్‌న్యూస్:** మండలంలోనిమొగల్తూరులో లాక్ సెంటర్ వద్ద తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు బస్వాని ఏడుకొండలు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పాల్గొని పార్టీ సీనియర్ నాయకుడు బస్వాని ఏడుకొండ లను శాలువా కప్పి సత్కరించారు.అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ. 5 లక్షల ప్రమాద భీమా సౌకర్యం పార్టీ ద్వారా కల్పిస్తున్నామని అన్నారు. కార్యకర్తలు లేదా వారి కుటుంబ సభ్యుల వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం కల్పిస్తారని తెలిపారు. కార్యకర్త కుటుంబంలో విద్యార్థుల చదువుకు సహాయం, కుటుంబ సభ్యులకు ఉపాధికి సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరపురుగు తాతాజీ, కొండేటి శ్రీను, కర్రి వీరాస్వామి, కునపరెడ్డి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.